
కీచక
వధ

ఊరికి ఉత్తరంగా పెద్దబావి. అది ఓనడబావి. ఆ నడబావికి ఈశాన్యం వైపుగా కనుచూపు మేరలో కొనమాకుల మోటబావి. ఆ మోటబావి 'దోర్నం పట్టెడ' మీద నిలబడ్డాడు సిద్ధులుగాడు. ఎడమకాల్ని ఎత్తి దోర్న పట్టెడ మధ్యగా బిగించిన రెండు చెవ్వల్లో ఓ చెవిమీద పెట్టాడు.

మరో క్షణంలో వాడా బావిలో దూకబోతున్నాడు!

అది ఎనిమిదిమట్లలోతు బావి. ఆ బావిలో నాలుగు మట్లువరకు నీళ్ళున్నాయి. అంతెత్తు నుండి దూకుతున్నామన్న ఆలోచనే లేదు వాడికి! వాడు నిలబడడంలో రాచఠీవి వుంది. వాడి మొగంలో వెలుగువుంది. ఆ వెలుగు చంద్ర నిప్పులు చెరుగుతున్న నడిమిట్టమీది సూర్యుడి వెలుగుతో పోటీ పడుతూ ఉంది.

ఒక్కసారి వాడు చుట్టూ కలయచూశాడు!

మండుతున్న ఎండధాటికి పైరు పచ్చలు మూతులు ముడిచి తలలు వాల్చాయి. గువ్వాగత్రా చెట్ల ఆకుల మాటుల్లోచేరి మాగన్నుగా నిద్ర

పోతున్నాయి. గొడ్డుగోదా చెట్లకింద గోములాడుకొంటున్నాయి. మిట్ట మధ్యాహ్నం మనిషి అలికిడిలేదు. ఎండ తాపంతో ప్రకృతి పల్లెత్తడంలేదు.

సిద్ధులుగాడు మాత్రం ఆనందంతో ఊగిపోతున్నాడు. వాడు అంటున్న మాటల్ని వినడానికి ఆ రోజు ఎందుకో, ఏమో? అక్కడ మానవ మాత్రుడులేడు. అందుకే వాడికి ఎక్కడలేని ధైర్యం వచ్చినట్లుంది.

"ఒరే! ముదనష్టపు ముండ నాకొడకల్లారా!....మా యబ్బల సెంవట తింట్రి. మా యబ్బబ్బల సెంవట గుటగుట తాగితిరి. ఇప్పుడు తోడుకు మా సెంవటతో తానంవాడతా నంటా వుండారు. ఇదంతా సాల్దని మా ఆడ పడుసులు కావాల్నా పక్కల్లోకి? వస్తారా!....వస్తారు!!—వచ్చుండ్లా?.... హ్హాహ్హాహ్హా!"—

నిప్పులు కక్కుతున్న ఎండలో దోర్నం పట్టెమీద నిలబడి వికటంగా నవ్వుకొన్నాడు సిద్ధులుగాడు. అవి నవ్వులుగావు!—చంద్రనిప్పుల రవ్వలు!!—ఆ నిప్పురవ్వల్ని భరించలేకనేమో?—వాడు ఎగిరి బావిలో దూకాడు.

"దభిల్లు"మన్న శబ్దంతో బావిలో అలలు రేగాయి. రేగిన అలలు దరువుల్నితాకి బావిలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నాయి.

అంత ఎత్తునుండి దూకడంతో సరాసరి అడుక్కు వెళ్ళాడు సిద్ధులుగాడు. అడుగుతాకి చివ్వలా నీళ్ళపైకి వస్తున్నాడు. చేతులతో కాళ్ళతో నీళ్ళను కసిదీరా కొడుతున్నాడు. ఆ కొట్టుడు పేరు ఈత!

"గంగా భవానీ! నిన్నీశ్వరుడు నెత్తిన బెట్టుకుంటే నువ్వేమో మాలాంటోళ్ళను కడుపున పెట్టుకుంటుండావ్? వాణ్ణిగాదే గుటుక్కున మింగ డానికి!—ఏదీ నా జోలికి రా సూద్దాం?"—

బావిలో నీళ్ళతో సవాల్ చేస్తూ బావిని మూడుచుట్లు చుట్టుతున్నాడు.

ఆ తరువాత గబగబా గట్టుపై కెక్కుతున్నాడు. ఒక్కలగువుతో దోర్నం పట్టెపైకెక్కుతున్నాడు. దర్జాగా నిలబడుతున్నాడు. అటుయిటు చూస్తున్నాడు. ఎవ్వరు కంటపడకపోయేసరికి తెపరాయిస్తున్నాడు!

"ఒరే! కూసోనితినే కుండాకోరు ఎదవల్లారా! ఎల్లకాలం సీగిట్లోనే వుంటారనుకోవద్దురా! మా గుడిసెబతుకుల్లో ఎప్పుడో ఒకప్పుడు పొద్దు మొలవనే మొలుస్తుంది!" అని అంటూ మళ్ళీ బావిలో దూకుతున్నాడు. పూడును తాకుతున్నాను. 'రంయ్!' మని పైకి లేస్తున్నాడు. "వాణ్ణిగాదే కడుపున పెట్టుకునేదానికి!" అని కాళ్ళుచేతులతో బావిలోని నీళ్ళను యిష్టం వచ్చినట్లు బాదుతున్నాడు. బాదుతూ బావిని నాలుగుచుట్లు వేస్తున్నాడు!

మరలా గబగబ గట్టుపై కెక్కుతున్నాడు.

దోర్నం పట్టెమీద దర్జాగా నిలబడుతున్నాడు.

అక్కసుదీర కడుపుమంటను కక్కుతున్నాడు!

ఆ మీదట బావిలో దూకుతున్నాడు. దూకి కాళ్ళుచేతులతో నీళ్ళను కసిదీరబాదుతున్నాడు!

గబగబ గట్టుపై కెక్కడం....ఎగిరి దోర్నంపట్టెపై నిలబడడం.... నోటికి వచ్చినట్లు కాసేపు వాగడం....బావిలో దూకడం కాళ్ళుచేతులతో బావిలోని నీళ్ళను కసిదీరబాదడం....

వరసక్రమం తప్పకుండా చేస్తూనే వున్నాడు సిద్ధులుగాడు!

ఎంతసేపు తిట్టినా....ఎన్నిసార్లు బావిలో దూకినా....వాడి ఒంటిపై మంటలు చల్లారనట్లుంది. ఎందుకో?....ఏమో?....

* * *

అది ఒకపల్లె!

ఆపల్లె భారతదేశంలోనే - అందులో నిన్నగాక మొన్న రజతోత్సవాల్ని రంజుగా జరుపుకొన్న ఆంధ్రదేశంలోనే వుంది.

మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అంటే—తనంతట తానుగారాలేదు. ప్రాణాల్ని బలిగొనింది. రక్తాన్ని చవిచూపింది. ఆస్తిపాస్తుల్ని హరింప చేసింది. రాకుండా వుండడానికి చేయవలసినంత చేసింది. ఆ తరువాత అతి కష్టంమీద అయిష్టంగా యిక తప్పదన్నట్లుగా వచ్చింది. నిన్నగాదు మొన్న గాదు. ముప్పయి మూడేండ్ల కిందట. అప్పుడే అన్నాడు గాంధీ మహాత్ముడు

గ్రామసీమలు దేశ సౌభాగ్యసీమలని!__ఆ తరువాత ఆ మాటల్నే చాలా మంది చాల చాల విధాలుగా అంటూనే వున్నారు. మనం వింటూనే వున్నాం!

అయితే ఆ పల్లె మాత్రం అప్పటికీ ఇప్పటికీ ఒకే మాదిరిగా వుంది. పాపం! రంగులు మార్చడానికి దానికి చేతకానట్లుంది!

"ఆ పల్లెకు ఎటువెళ్ళాలి?" అని ఆ పల్లీయుణ్ణే నిలదీసి అడిగితే కాసేపు తటాపటాయించి ...తీరిగ్గా తలగోక్కొని నసుగుతూ నసుగుతూ చెబుతాడు_మూడుబస్సులుమారి ఆపైన నాలుగుమైళ్ళు వినోభా భావేగారి అనుచరుడనిపించుకొంటే_ఆ పల్లె దర్శన మిస్తుందని!

మోటారు చేరకపోయినా ఆ పల్లెకు పంచాయితీ వాళ్ళ రేడియో గవర్నమెంటు సారాయి చేరింది. రకరకాల సిగరెట్లు చేరాయి. రాజకీయాల పిగపట్లు వెలిశాయి! బీడీలు కూడా చేరాయి. పొగాకు ముక్కుపొడి మాత్రం ఆ ఊరు పుట్టినప్పటినుండీ వున్నాయి.

అలాంటి పల్లెలో అప్పటికి సరిగ్గా నెలరోజుల క్రితం!

వెన్నెల వెల్లువలా ఆ పల్లెమీద పడింది. చలిగాలి వయోభేదాన్ని మరచి చక్కిలిగింతలు పెడుతూ వుంది. ఆ వెన్నెల్లో చిన్నపిల్లలు 'వెన్నెల కుప్పలు' ఆట ఆడుకుంటున్నారు. కుర్రకారు ఊరుబయట బీడుచేనుల్లో 'ఉప్పరపట్టి' కాస్తున్నారు. నడితరానికి పైబడ్డ జీవులు మాత్రం ఊరి నడి బొడ్డులోని 'రచ్చబండ' వద్ద చేరారు.

'రచ్చబండ' దగ్గర తీరిగ్గా కూర్చుని కొందరు బీడీలు కాలుస్తున్నారు. మరికొందరు కాళ్ళు బారసాచి హాయిగా కూర్చుని ఆదమరచి పొగాకు నములుతున్నారు. ఈ అలవాట్లకు లోనుగానివాళ్ళు మాత్రం దుప్పట్లకు లోనయ్యారు.

ఆ ఊళ్ళోనే రాములవారి గుడి వుంది. గుడిలో దేవుడున్నాడు. ఆ దేవుడి ముందు నిలబడి ఎటువంటి అబద్ధమైనా ధీమాగా చెప్పగల మనిషి రచ్చబండవద్ద నిలబడితే సీళ్ళు నములుతాడు.

అది రచ్చబండ మీది భక్తితో గాదు—బసిరెడ్డి మీద భయంతో!

బసిరెడ్డికి తాతముత్తాతలు సంపాదించి పెట్టిన ఎకరాలకొద్దీ చెరువు కింద భూములున్నాయి. చేతినిండా డబ్బువుంది. మాటతీరులో నేర్పువుంది. పెదవులపై చిరునవ్వు వుంది. కనుల్లో కరుణ వుంది. గుండెల్లో మాత్రం మంట వుంది.

అందుకే ఆ పల్లె అతని చేతికింద వుంది.

రావిచెట్టు కింద రచ్చబండమీద పొడలు పొడలుగా పడుతూ వుంది వెన్నెల. రాగి ఆకుల సందుల్లో దూరాన చల్లగాలి సంగీతం వినిపిస్తూ వుంది. విశాలమైన నల్లరేగడి నేలమీద అక్కడక్కడ ఆరవేసిన తెల్లటి దుప్పట్లు గాలికి కదలాడుతున్నట్లు మేఘాలు కదలలేక కదులుతున్నాయి.

రచ్చబండ దగ్గరికి బసిరెడ్డి రాచఠీవితో వచ్చాడు.

చేతుల్లో పిగరెట్లు చేతుల్లోనే నలిగిపోయాయి. నోట్లోని బీడీలు జారి కిందపడ్డాయి. దుప్పట్లు సర్దుకొని లేచి నిలబడ్డారు.

బసిరెడ్డి రచ్చబండమీద ఆసీనుడయ్యాడు.

రెడ్డిగారు అలా కూర్చుంటే - ఆయనగారి దర్పమూ దర్జా ఆ రచ్చబండమీద ఓ పరిధిని గీస్తాయి. అంతో ఇంతో పెసులుబాటున్నవాళ్ళు ఆ రచ్చబండ మీదనే కూర్చున్నారు. అడుగులకు మడుగులొత్తే రకాలు ఆయన పాద సన్నిధిలో అంతచోటు సంపాదించుకొన్నారు. ఎటూ కానివాళ్ళు వీధిలో నేలమీద యింటి ముందరి అరుగులమీద కూర్చున్నారు రెడ్డిగారు విసిరేసిన మెతుకుల్ని ఏరుకుని తినే 'పడుపు కూటిగాళ్ళు' రెడ్డిగారి అంగరక్షకుల్లా నిలబడి మీసాలు మెలివేస్తూ రెడ్డిగారి దర్జాను చాటుతున్నారు.

రచ్చబండకు రవ్వంత దూరంలో ఓ నడికారు ఆడది నిలబడివుంది. ఆమె చూపులు నేలను తొలుస్తున్నాయి. రెడ్డిగారి చూపులు మాత్రం అప్పుడప్పుడు ఆమెను పరామర్శిస్తున్నాయి. ఓ అమ్మాయి అబ్బాయి ఆమె బిడ్డలేమో! కాళ్ళకు చుట్టుకొని నిలబడి వున్నారు.

జాముర్రాత్రికే ఆ పల్లెలో రెండు జాముల వాతావరణం నెలకొనింది.

రచ్చబండ దగ్గర మౌనం మేలమాడుతూ వుంది.

అక్కడ కూర్చున్న అందరు ఆలోచిస్తున్నారు. తలకొక తీరుగా ఆలోచిస్తున్నారు. అయితే అందరి ఆలోచనలు ఒకే తీరుగా కొనసాగుతున్నాయి. ఆ ఆలోచనలన్నీ 'పాతప్పులోడి' మీదే!

రెడ్డోరి సేద్యగాడు కాకమునుపు వాడి పేరు వెంకట్రాయులు!

వెంకట్రాయులు అందరిలాగానే పుట్టాడు. అల్లారుముద్దుగా కాకపోయినా—వున్నంతలో అంతో ఇంతో గారాబాలు తిని పెరిగాడు. పెళ్ళి చేసుకొన్నాడు. ఓ బిడ్డ తండ్రి కూడా అయ్యాడు. అయితే వాడీలోకంలో ఎలాంటి గుర్తింపుకు నోచుకోలేకపోయాడు.

ఒక్కబిడ్డ తండ్రి అయిన తరువాతనే వాడు రెడ్డోరి ఇంట్లో అడుగు పెట్టాడు. అడుగుపెట్టిన వేళావిశేషం ఏమిటో కానీ—కుక్కలు వాడిదగ్గర విశ్వాసం నేర్చుకున్నాయి. ఆ ఊరి కోళ్ళు వాడి కూతతో మేలుకొన్నాయి.

సేద్యగాడంటే కూలిగాడు. అయితే వెంకట్రాయులు మాత్రం ఎప్పుడూ కూలి సేద్యం చేయలేదు. ఆ వూళ్ళో వాడి కూలిసేద్యం సొంత సేద్యంతో పోటీపడింది.

ఊళ్ళోవాళ్ళ దృష్టి వాడిమీద పడింది.

'దిష్టి' తగిలిందని కాపిన్ని ఉప్పురాళ్ళో.... మిరపకాయలో.... దిగదీసి వేయడానికి వెంకట్రాయులికి వాళ్ళమ్మ లేదు. ఆలికి ఆ అవకాశం ఎంత ఏడ్చి మొత్తుకున్నా దొరకదు.

వెంకట్రాయులు నిద్రలేస్తాడు. బానా మోకు భుజంమీద పెట్టుకుంటాడు. జోడెద్దుల పగ్గాల్ని ఒక చేతపట్టుకొంటాడు. నాగులమిట్ట బావిలో మోటకడతాడు. మోట తోలుతూ 'రావన్న రాఁవో!' అని పాట అందుకొంటాడు.

ఆ పాట చెవిని పడటంతో ఊళ్ళో తొలికోడి బద్దకంగా ఒళ్ళు విరుచుకొంటుంది. 'ఔరా! వెంకట్రాయులూ!' అని ఆశ్చర్యపడి వాడి స్వామిభక్తికి ఆనందపడి—రెక్కలు తట్టుతూ కూతవేస్తుంది.

ఆ కూతతో ఊరు పులిక్కిపడుతుంది. ఆదరాబాదరా పైకి లేస్తుంది. తట్టాబుట్టా సర్దుకొంటుంది—ఆ నాటి పనీపాటా కోసం.

తూర్పున పటమెగిరేసరికి ఆ బావి కింద మడికి తడివేస్తాడు. మరో బావికింద దుక్కి దున్నడానికి ముందు మడక పట్టతాడు. మూడో నాలుగు వెనుక మడకలు వెంట పడలేక సంకట పడుతూంటే 'ఒరే! సోమారి పోతునాయాండ్లాలా! అట్లా తూగతావుండా రెందుకురా? అదిలించి కొట్టి ఎంటెంటనే రారాదూ!' అని మాటిమాటికి మందలిస్తుంటాడు.

రెండుబార్ల పొద్దెక్కేసరికి రెడ్డమ్మ సద్ది పంపుతుంది.

మడకలు నిలబెడతారు!

మడకలు అలా నిలబెట్టీ నిలబెట్టక ముందే వెంకట్రాయులు ఒక్క ఉరుకులో దరిదాపుల్లో ఉన్న మోటిబావి దగ్గరికి పరుగెడతాడు. ఆ కాలువలో పారుతున్న నీటి అడుగున పేరిన సన్నని యిసుకను రెండు చిటికలు తీసి నోట్లో వేసుకొంటాడు. ఇటు రెండుసార్లు అటు రెండుసార్లు చూపుడు వ్రేలిని పోనిచ్చి పండ్లు తోమిందయిందనిపిస్తాడు. దోసెడు నీళ్ళని రెండు సార్లు పుక్కిలించి ఊస్తాడు. ఆ తడి చేతులతోనే మొగాన్ని అలా తుడుచు కొంటాడు. అటుపై తలకు చుట్టిన తుండుగుడ్డను విప్పి మొలకు చుట్టు కొంటాడు. తూర్పువైపు తిరుగుతాడు. రెండు చేతులు జోడించి సూర్య భగవానుడికి దండం పెడతాడు.

మూడుసార్లు చేతులు పైకెత్తి జోడిస్తే—పూజ ముగిసినట్లు!

ఆ తరువాత ఆ కాలువ గనిమ మీదనే కూర్చుంటాడు.

రెండు దోసిళ్ళ సద్ది రెండు క్షణాల్లో తాగినట్లనిపిస్తాడు.

అప్పటికి వెనుక మడకలు దున్నుతున్న కూలోళ్ళు ఆ గనిమ ఈ గనిమ తిరిగి పళ్ళు తోముకోవడానికని అంత 'గుంటగంజేరాకు'ను సేకరించు కొని నిక్కుతూ నీలుగుతూ కాలువ దగ్గరికి వస్తారు.

వెంకట్రాయులు వాళ్ళమీద ఒక్కసారిగా విరుచుకుపడతాడు.

"ఇదేందిరా నీతో పెద్దపొటుకయ్యి పొయ్యిందే! — ఒక వక్క కొరికినంతసేపు కాలేదు మడకలు నిలిపి! — మొకంవట్లా కడుక్కోవాల్నా పళ్ళేందా?.... సద్దంత నోట్లో పోసుకోనిస్తావా? లేదా?"

వినుక్కొంటారు వెనుక మడగ్గాళ్ళు!

"మడకల్నిలిపి నేను మాత్రం మొకం కడుక్కోలేదా?.... సద్దాగ లేదా? మీరు జెప్పేది బల్లే యిచ్చిత్రంగా ఉండాదే?" — రెట్టిస్తాడు వెంకట్రాయులు.

"ఒరే నీకంటే గాచ్చారం పట్టిందిరా పాతప్పులు తీర్చాలని! మాకేం పట్టింది? — మీ రెడ్డి పితికే పితకడానికి చేసే యీ పని సాల్లే!"

తమ అభిప్రాయాల్ని వెనుకేసుకొస్తాయి వెనుక మడకలు!

"అయితే నేను పాతప్పులోడనా మీరనేది?"

"మేవన్లేదుకానీ.... నువ్వే అంటా ఉండావు. బలేకుదిరిందిరా పేరు! "పాతప్పులోడు!" — గల గలా నవ్వాయి వెనుక మడకలు.

ఏ రోజు యే వేళప్పుడు జరిగిందోకానీ 'ఈ సంభాషణ — వెంకట్రాయులు అన్న పేరు వెనుకబడి 'పాతప్పులోడు' అన్న పేరు ముందు పడింది. ఆ తరువాత ఆ పల్లె నోట్లో పడింది.

పాతప్పులోడు అనబడే ఈ వెంకట్రాయులు ఓ రోజు తెల్లవారు జామున నాగుల మిట్ట బావిలో మోట తోలుతున్నాడు. నిండు బానపైకి వస్తుంటే అనుకోనట్లుగా మోకు తెగింది. మోకుమీద కూర్చున్న పాతప్పులోడు "దభీ" మని క్రిందపడ్డాడు. ఓ మోపుమీద ముందుకు వెళ్ళుతున్న ఎద్దులు బారిలో బోర్లగిలాపడ్డాయి. బాన బావిలో పడింది.

ఆదరాబాదరా పైకి లేచాడు పాతప్పులోడు. దుమ్ముదులుపుకొన్నాడు. వీపుదట్టి ఎద్దుల్ని సేదదేర్చాడు. ఆ మీదట ఒక్కక్షణం నిలబడి ఆలోచించాడు.

ఆ సాయ కట్టులో ఏ బావిలో ఏది పడినా తాను బావిలో మునిగి ఆ వస్తువును పైకి తేవలసిందే!

అలాంటప్పుడు తన బావిలో తన బానే పడింది.

వాడు వెనకాముందు చూడలేదు. చీకటినిలెక్క పెట్టలేదు. గబగబా బావిలో దిగాడు. తలక్రిందికిపెట్టి కాళ్ళు పైకెత్తి 'సొరమునక' వేశాడు, బావి అడుగులో ఉన్న బానను పైకి తేవడానికి!

నీళ్ళల్లో చేపలా నీళ్ళల్లో దూసుకుపోతున్నాడు. ఎండ పొద్దున అయితే నీలిరంగు నీళ్ళల్లో కూడా కాస్త వెలుతురున్నట్లు కనుపించేది. అసలే చీకటి. నల్లని నీళ్ళల్లో చీకటి. చిమ్మ చీకటిలో ఏమీ కనుపించని స్థితిలో ముందుకు దూసుకపోతున్నవాడు సరాసరి బానలోనే దూరాడు. బాన యినుప గుండ్రానికి అమర్చిన నాలుగు కమ్ములు అడ్డదిడ్డంగా ఉంటాయి. ఆ కమ్ములమధ్య తల యిరుక్కొనింది.

శక్తికొద్దీ పెనుగులాడాడు. విలవిలా కొట్టుకొన్నాడు. కమ్ముల సందుల్లో యిరుక్కున్న తల వీడి రాలేదు. అమాంతంగా బానను అలానే పైకి తేవాలన్న ప్రయత్నం ఫలించలేదు.

పాతప్పలోడి ప్రాణాలు నీళ్ళల్లో కలిసిపోయాయి.

వాడి చావుతో వాడిమీద ఆధారపడి బ్రతుకుతున్న వాడి పెళ్ళాం, పిల్లలు వీధిని పడ్డారు. అది చూచి, వాడికేదో అన్యాయం జరిగిపోయిందని ఊళ్ళో నలుగురు నాలుగు విధాలుగా అనుకొంటున్నారు.

ఆ మాటలే రెడ్డిగారి చెవిలో పడ్డాయి.

ఈ చెవిలో పడ్డ మాటల్ని ఆ చెవిలో వదలడానికి రెడ్డిగారు చేతగాని వాడేమి కాదు.

చేతగానివాడు చేతులు ముడుచుకొని కూర్చుంటాడు. లేదా ఎవరి కర్మ వాడనుభవిస్తాడని కర్మసిద్ధాంతంపై పడతాడు.

కానీ రెడ్డిగారు మాట పడే మనిషికాదు. మాటలన్నవాడిని మర్యా

దగా పిలిపించి, వాడి వేలితోనే వాడి కన్నును పొడిపించి, 'అయ్యో! కన్ను పొడుచుకున్నావా నాన్నా!' అనిఆదరభావాన్ని ప్రకటించే చేతనైన మనిషి బసిరెడ్డి.

అందుకే అంత రాత్రిపూట రచ్చబండ దగ్గర మద్దిస్తం కోసం మందిని చేరవేసినాడు.

బసిరెడ్డి గొంతు సవరించుకొన్నాడు.

అందరు చెవులు రిక్కించి, రెడ్డివైపు చూపులు తిప్పారు. వెలివేసినట్లు దూరంగా నిలబడివున్న నడివయసు ఆడది ఒక్కసారి తల ఎత్తి రెడ్డిగారివైపు చూసి, మళ్ళీ తలదించుకొనింది.

"దేవుడికి దయలేదు. ఉంటే యిట్లా నా కుడిభుజమే పడిపోతుందా? ఒక కన్ను కన్నుగాదు. ఒక చెయ్యి చెయ్యిగాదు—అన్నారు పెద్దోళ్ళు. ఒక చేతిని పోగొట్టుకొని నేనిట్లా అల్లాడతా వుంటే, ఈ అడ్డదిడ్డమైన మాటలు! రామరామ! చచ్చినవాడెట్లా వెంకట్రాయులు ఒక్కదినంతో చస్తే ఈ మాటల్ని పడలేక నేను దినమూ చస్తుండాను!"

తనలోతాను అనుకొన్నట్టుగా అందరికీ వినపడేలా అన్నాడు బసిరెడ్డి. ఆపై ఓ నిట్టూర్పు విడిచాడు భారంగా.

"మీరంతా అంటావుండేదేవిటంటే!"

"తొలికోడి కూతకు ముందే వెంకట్రాయులు మోట కట్టేవాడని!"

"నిజమే! నేను కాదనలేదే!"

"ఇకపోతే ఎప్పుడు తింటాడో, ఎప్పుడలా పడి లేస్తాడో ఆ దేవుడికే ఎరిక. ఎప్పుడు చూసినా ఏదో ఒక పని చేస్తావుండె కదా? అని!"

"అవును. చేయలేదని నేను చెప్పలేదే!"

"అలాంటివాడు అన్యాయంగా మా మోట బానలో యిరుక్కొని పెరుక్కోలేక చచ్చిపోయాడే? అని."

"అవును! - అయితే ఎవరిబాన ఏ బావిలో పడినా ఏ కదురుకోలు ఏ బావిలో పడినా మునిగి ఎత్తిస్తా వుండిందెవురు? - వాడే గదా? అట్లాంటి సమయాల్లో వాడికి యిట్లాంటి గతే పట్టుంటే - నాకు తెలియకుండా అడుగు తుండాను - ఎవరు మాత్రం ఏం చేస్తారు? - చెప్పండయ్యా! .... మీరే చెప్పండి!"

రచ్చబండవద్ద కూర్చున్న వాళ్ళను రాదీసి రాళ్ళు వేస్తున్నాడు బసి రెడ్డి!

"అదిగూడ నిజఁవే గదబ్బా మరి!" - అని రచ్చబండ వద్ద చేరిన జనం ఎవరికి వారు గొణుక్కొంటున్నారు యింకొకరికి వినబడే టట్లుగా!

"మీరంతా అనుకుంటా ఉంటారు - వాడా వెంకట్రాయులేదో ఒరగ బెడితేనే నేనింత వాణ్ణయ్యాను అనీ! - వాడు చేసింది మీ కంటపడిందికానీ మేమెంతచేసి వుంటే వాడంత సొంతగాడుగా మెలిగినాడన్న సంగతి మీకు తెలియదు. ఎందుకంటే - చేసిన మేలును చెప్పుకునేతత్త్వం మా యింటా ఒంటాకూడా లేదు. కాబట్టి! - అవసరం వచ్చింది కాబట్టి అంటున్నాను— మా నాయన వాళ్ళ నాయనకు తాకట్టు గీకట్టూ ఏమీ లేకుండా వెయ్యి రూపా యలు అప్పు యిచ్చినాడు."

ఏమయిందోయేమో? - రాగి మాని మీది తీతువు పెట్ట ఉన్నట్లుండి వికృతంగా అరిచింది.

అందరూ తలలు ఎత్తిచూశారు!

అంత దూరంలో నిలబడివున్న ఆ నడి వయసు ఆడదికూడా—ఒక్క సారి తల ఎత్తి ఒక్క చూపు చూసింది—రెడ్డిని నమిలేసేటట్లు!

రచ్చబండకు దూరంగా....ఎవరికంటా పడకుండా కూర్చుని....జరుగుతున్న బోగోతాన్ని శ్రద్ధగా వింటున్న సిద్ధులుగాడు కాలుస్తున్న బీడీని విసిరి నేలకేసికొట్టి కారి ఉమ్మాడు.

"ఏనాడైనా పల్లెత్తి అప్పు మాట ప్రస్తావించానా?—లేదు వడ్డికట్టమన్నానా? చేసిన పనికి తీసుకున్న అప్పుకు సరికిసరి—సరిపోయింది అన్నానా? అడగండి వాణ్ణి!"

అడగవలసిన వాడు అక్కడ లేదన్న సంగతి తెలిసీ ఆవేశంతో అడుగుతున్నాడు రెడ్డి. ఎవరిని అడగాలో?—ఎలా అడగాలో?—తెలియక రచ్చబండ తలవంచింది. అదే అదననుకొన్నాడు బసిరెడ్డి!

"పోనీ! అక్కడ నిలబడి ఉందిగదా వాడి పెళ్ళాం. దాన్నేఅడగండి. ఏనాడైనా వాళ్ళ కూటికి లోటు చేశానేమో?"

రెట్టించి అడుగుతున్నాడు రెడ్డి!

నోరు విప్పలేక పోయింది వాడి పెళ్ళాం!

వాడి పెళ్ళామే నోరు విప్పలేకపోయేసరికి రచ్చబండకు నోరు కదపవలసిన అవసరం తీరి పోయింది!

"పాలన్నంతినే యింత మంది పెద్ద మనుష్యులు యిక్కడ చేరినారు. బాగుంది. ఈ యింతమందిలో ఎంతో కొంతమంది ఏవేవో మాట్లాడినారు నన్ను గురించి. అయినా ఫరవాలేదు. కానీ-గవర్నమెంటోళ్ళు కూడా యిచ్చిన అప్పును సాఫు చెయ్యరు. చచ్చినవాడి బిడ్డలకో పెళ్ళానికో వెంటనే ఉద్యోగాలివ్వరు. కానీ—వాడా వెంకట్రాయులు కార్చిన చెమటను తలచుకొంటుంటే నాకు కన్నీళ్ళు ఆగడంలేదు. అందుకే వాడి బాకీని మాఫు చేస్తుండాను. రేపటినుండీ వచ్చి వాడి పెళ్ళాన్ని యింట్లో పని చూసుకోమనండి. అది యింట్లో పనీ పాటా చూసుకొంటుంటే దాని బిడ్డలు గొడ్డు గోదా మేపుకొంటుంటారు."

చాలా ఉదారంగా వెలువడ్డాయి రెడ్డిగారి నోటినుండి మాటలు!

వీళ్ళనాయన వాళ్ళనాయనకు వెయ్యిరూపాయలు అప్పు ఎప్పుడిచ్చాడో? ఎందుకిచ్చాడో? ఇచ్చిన దానికి దాఖలాయేమిటో?—అడగలేని రచ్చబండ రెడ్డిగారి ఔదార్యాన్ని అపుననింది.

"మిమ్మల్నిక్కడికి పిలిపించాల్సిన అవసరమూ లేదు. ఇదంతా యివరించి సెప్పాల్సిన అవసరం౹వూలేదు. రెడ్డోరు మంచోరు కాబట్టి యింత ఓపిగ్గా జరిగిందంతా సెప్పినారు, ఇంకెక్కడైనాసరే! — ఎవుడైనాసరే! యిట్లాంటి అడ్డదిడ్డం మాట్లన్నారో? — అక్కడికక్కడే పగుల్తుంది బుర్ర! జాగర్త!"

మీసాలు మెలివేస్తూ "పడుపుకూటిగాళ్ళు" గొంతు చేసుకొన్నారు.

మళ్ళీ ఒక్కసారి తుపుక్కున ఉమ్మాడు సిద్ధులుగాడు మనిషికంట పడకుండా!

మలిజాము దాదాపు ముగుస్తూవుంది. ఊరికి దక్షిణంగావున్న మంచి నీళ్ళ గుంటలో ఎండ్రకాయలు మెక్కడానికని వచ్చిన పొట్టినక్కలు ఊళలు వేస్తున్నాయి. కొలిమి చింతమానులో మిణుగురు పురుగులు వెన్నెల్లో వెల వెలపోతున్నాయి. దేవుడిముందు ధైర్యంగా నిలబడగలిగిన ఆ పల్లెజనం రచ్చబండకు తలవంచి ఒక్కొక్కరుగా యింటిముఖం పడుతున్నారు. "పడుపుకూటిగాళ్ళు" చేతిలో పావలా పరక పడేసరికి అంతరాత్రిలోకూడా గుంటకట్ట మీది సారాయి అంగడివైపు పరుగులు తీస్తున్నారు-చలికి తట్టుకో లేక. "పాతప్పులోడి" పెళ్ళాం వెళ్ళిపోతున్న జనంవైపు ఒక్కసారి, రచ్చ బండమీద రాచఠీవి ఒలకబోస్తున్న రెడ్డిగారివైపు ఒక్కసారి చూచి గిరుక్కున వెనక్కు తిరిగి బయలుదేరింది.

ఆ నడివయసు ఆడదాని నడక హొయలు రెడ్డి గుండెల్లో గుబులు రేపింది! దాని ఒంటిమీది వంపులు రెడ్డిగారి చెక్కిళ్ళపై కెంపులు పూయించాయి! మీసం మెలివేశాడు రెడ్డిగారు!

"ఇద్దరు బిడ్డలతల్లి అయితేకూడా పట్టు సడల్లేదే ఆడదానికి" అను కొన్నాడు. కను మరుగయ్యేవరకు అలానే చూస్తూ వుండి ఆ మీదట తనలో తాను నవ్వుకొంటూ బయలుదేరాడు!

* * *

"పడుపుకూటిగాళ్ళ" బుర్రలు బద్దలవుతాయని హెచ్చరించినా—బసిరెడ్డి మొసలికన్నీళ్ళు గార్చినా—లోకులు లోకులే! — "పాతప్పలోడి" చావునుగురించి చిలువలు పలువలుగా చెప్పుకొంటూ వుండగానే చెప్పకుండా చెందకుండా మూడువారాలు దొర్లిపోయాయి.

ఒకనాటి సాయంకాలం. పొద్దుగూట్లో పడబోతావుంది. నాగుల మిట్టబావి ప్రక్కన గడ్డమీద నిలబడ్డాడు బసిరెడ్డి. కోతకు వచ్చిన జొన్న చేలవైపు ఆనందంగా చూస్తున్నాడు.

ఎక్కడున్నాడో? యేమో? సిద్దులుగాడు. ఒక్కలగువులో వచ్చి "దండాలయ్యా!" అంటూ పాదాలమీదపడినంత పనిచేశాడు.

ఒక్క అడుగు వెనక్కువేసి వాడివైపు వాడిగా చూస్తున్నాడు బసిరెడ్డి. ఆ వాడిచూపుల్లో పడిపోయిన కసివుంది. 'వాడెందుకు వచ్చాడా?' అన్న సందేహమూవుంది.

"దాని బుద్ది గెడ్డితిని బూతులు కూసిందంటయ్యా - పిచ్చిముండ! నాతోసెప్పి సెప్పి మొత్తుకొనింది. ఇప్పుడెంత బాదపడిపోతా వుండా దంటే...."

"కూస్తుందిరా కూస్తుంది! కూయకేం జేస్తుంది? వాడు వెంకట్రాయులుగాడు మూడు పూటలు ముక్కులదాకా మెక్కబెట్టితే ...ఒంట్లో యింకా రసి వుండ్లా! అందుకే కూస్తుంది. కూయనీ....కూయనీ.... గొర్రె కొవ్వేదంతా గొల్లోడికేరా లాబం!" బసిరెడ్డి కసిగా మాట్లాడుతున్నాడు.

"అయ్యా అయ్యా! అంతఁత మాట్లనకండయ్యా! ఏదో తెలిసీ తెలియక కూసింది. పెట్నా కొట్నా మీరేగదయ్యా మాకు దిక్కు! మీరే కోపగించుకుంటే మాలాంటోళ్ళ బతుకేం కావాలయ్యా? రగతం పంచుకొని పుట్టింది. దాని తపన సూళ్ళేక తఁవరి కాళ్ళు పట్టుకొంటుండా!"

కాళ్ళు పట్టుకోకనే కళ్ళసీళ్ళు పెట్టుకొన్నాడు సిద్ధులుగాడు.

"ఇంతకూ నువ్వనేదేఁవిట్రా?" అసహనంగా అడిగాడు బసిరెడ్డి.

"మీరే సెప్పండయ్యా! వాడు సచ్చి నెల దిరగలేదు. అంతలోపల్నే తఁవరి దాపన సేర్తే, మీరా ఊరుకోరు. మిమ్మల్నిచూసి ఊరా ఊరుకోదు. అందుకేనయ్యా! అదట్లా నోరు పారేసుకోనుంటుంది. ఇప్పుడేఁవో నా రొండు సేతులు గట్టిగా పట్టుకోని 'కూడా పుట్టిన నేరానికి రెడ్డోరి సెయ్యి పట్టియ్యరా!' అని బతిమలాడతా వుంది."

గుండెల్లో మంట చల్లారినా, రెడ్డిగారిలో బెట్టు తగ్గలేదు.

"సరే చూద్దాం లేరా!" అన్నాడు దర్పంగా.

"అట్లన్నారంటే మీ పాదాలకాడనే తల పగలకొట్టుకోని సస్తానయ్యా! 'నువ్వెందుకే యేడ్వేది పిచ్చినామొకఁవా! ఈ రేత్రికి రేత్రే రెడ్డోరి పాదాలకాడ నిన్ను పడెయ్యకపోతే నేన్నితో పుట్నే లేదనుకో!' అని వారంగా సెప్తానేవుండా దానితో. ఎట్టెట్లా కాపుకాసినానో ఆ దేముడికే ఎరిక. మీ రొంటిగా సిక్కుతేగదయ్యా! ఆ ఏడుకొండలోడి దయతో యిప్పటికి దొరికితిరి. ఈ రేత్రికి యీ తలమింద బొరువట్లా దించి పారేసుకుంటే ఆ మీదట్నే నాకు కంటిమింద రెప్ప పడబొయ్యేది!"

"ఈ రాత్రికే ఎట్లారా?" సందేహాన్ని వెలిబుచ్చాడు బసిరెడ్డి.

"అదెంతా మీకెందులేయ్యా! నేజ్జూసుకుంటాగదా! కానమాకల బాయిగెడ్డమింద గుడిసెలో మంచఁవేసినా! మంచంమింద సలవ జేసిన దుప్పట్లు పర్చినా. దుప్పట్లమింద మల్లిపూలు సల్లినా! ఇంక అదేఁవో మీ కోసరం

ఎదురుసూస్తా కూసోనుంటుంది. మీరట్లా ఊరిముందర పెద్దబాయికాడికట్లా రండి. మీ కోసరం నేనెదురు సూస్తావుంటా!"

బదులుకోసం నిరీక్షిస్తున్నాడు సిద్ధులుగాడు.

ఎప్పుడెప్పుడని మనసు గంతులు వేస్తున్నా పైకి ప్రదర్శించడం పెద్దమనుష్యుల లక్షణం కాదు.

బసిరెడ్డి పెద్దమనుష్యుల్లో పెద్దమనిషి.

అందుకే మెడ బిర్రుగానేబెట్టి తలను మాత్రం ఆడించీ ఆడించిన ట్లాడించాడు.

ఎగిరి గంతులు వేశాడు సిద్ధులుగాడు. రెండు చేతులు జోడించి దండాలు పెడుతూ వెనక్కు వెనక్కే పదడుగులు ఎంచి నడిచి ఆ తర్వాత తుపాకి గుండులా ముందుకు దూసుకుపోయాడు.

రెడ్డిగారి ఆహ్వానానికి ఏర్పాట్లు చేయాలిగదా మరి?

బసిరెడ్డి కూడా బయలుదేరాడు. సిద్ధులుగాడు చెవిలో వేసిన వార్త అమాంతంగా రెడ్డిగారి రెండు పదుల వయస్సును వెనక్కు నెట్టింది.

రెడ్డిగారు అడుగుదీసి అడుగు వేస్తుంటే దర్జా ఉట్టిపడుతూ ఉంది. అతని మొగం సంజ వెలుగుల్లో క్రొత్త అందాల్ని సంతరించుకొంటూ వుంది. అతని గుండెలనిండుకు ఆనందం తొణికిసలాడుతూ ఉంది.

ఇల్లు చేరాడు బసిరెడ్డి!

ఇంట్లో ఎవరైనా ఎందుకైనా పలకరిస్తే చిరాకు. కాసేపు మనసు పెట్టి ఆలోచించాలంటే పరాకు. నాలుగుముంతల నీళ్ళతో ఒళ్ళు కడుక్కోవాలంటే తొందర. అన్నం ముందు కూర్చుంటే కోడిగెలుకుళ్ళు.

ఆ వయస్సులో కూడా తనలో కలుగుతున్న అనుభూతికి తనలోతానే నవ్వుకొంటున్నాడు బసిరెడ్డి.

తొలిజాము దాటింది.

మెత్తటి పరుపు ముండ్లపొదలా పొందనంటూ వుంది.

కాలం ముందుకు నడవనంటూ మొండికి వేసినట్లుంది.

నిగ్రహించుకోలేక పడకమీద అటు యిటు పొర్లుతున్నాడు.

తొలిజాము తుది ఘడియలో బసిరెడ్డి పైకి లేచాడు. పిల్లిలా అడుగులు వేస్తూ మెల్లగా బయటపడ్డాడు.

చలికాలం. శుక్లపక్షం తొలినాటి చంద్రుడు అలా తొంగి చూసి ఎప్పుడో వెళ్ళిపోయాడు. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. అంత రాత్రిపూట వీధుల్లో ఎవరూ ఎదురుపడరని నమ్మకమున్నా—ఎందుకో బసిరెడ్డి బెదురు జింకలాగ దిక్కులు చూస్తూ నడుస్తున్నాడు. ఊరకుక్కలు కూడా చలికి తిన్నెల మాటున ముడుక్కొన్నాయి. నిద్ర పట్టని ఒకటీ అర ముసలికుక్కలు అతని రాకను గమనించినా మొరగలేదు—ఓపిక లేకనేమో?—'బ్రదుకు జీవుడా!' అని పెద్దబావి గట్టుకు చేరాడు బసిరెడ్డి.

ఆకు అలా అల్లాడితే అదిరిపడుతున్నాడు బసిరెడ్డి!—'సిద్ధులుగాడు వస్తాడో? రాడో?....వాణ్ణి నమ్మి ఎంతటి సిగ్గుమాలిన పని చేశామో?'—అనుకొనేసరికి బసిరెడ్డి నీళ్ళుగారిపోయాడు. ఊపిరి పీల్చి వదలడం కూడా యాతనగా వుంది.

ఎక్కడ నిలబడి ఎదురుచూస్తున్నాడో? ఏమో! సిద్ధులుగాడు! గస పోసుకొంటూ వచ్చి రెడ్డిగారి ఎదుట పడ్డాడు. రెడ్డిగారి ముఖం చేటంత అయింది.

"అయ్యా! జాగ్రత్తగా నా ఎనకాలే రావాల. ఈ సీగిట్లో ఎట్లా నడుస్తారో ఏంవో?"—గుసగుసమని చెవిలో ఊదాడు సిద్ధులుగాడు.

ఫరవాలేదన్నట్లుగా తల ఆడించాడు బసిరెడ్డి! — సిద్ధులుగాడు ముందు.... రెడ్డిగారు వెనుక....చేతిలో మేత చూస్తున్న మేకపిల్లలా వాడి వెంటపడ్డాడు!!

* * *

తెల్లవారింది!

"బసిరెడ్డి చచ్చిపోయినాడంట్నే."—

ఆ పల్లెలో ఎవరి నోట విన్నా యిదే మాట!

చుట్టుపక్కల పల్లెల నుండి గుంపులుకట్టి వస్తున్నారు జనం—బసిరెడ్డిని చూసిపోదామని!

అందరికీ ఒక్కటే సందేహం!—

"అంత రాత్రిపూట బసిరెడ్డి యిల్లు విడిచి ఎందుకు వెళ్ళినట్టు? అదిగూడ కాన మాకుల బావి జొన్నచేల దగ్గరికే ఎందుకు వెళ్ళాడు! మనిషితోడు లేకుండా అడుగు బయటపెట్టని మనిషి అంత రాత్రిపూట ఎందుకు ఒంటరిగా వెళ్ళినట్టు? వెళ్ళినా ఆ గెనిమలమిందనే ఎందుకు నడిచినాడో?—నడిచినా రెండు మూడు వుండల్నే ఎట్లా తొక్కినాడో?" ఈ సందేహాలతో ఆ పల్లె సతమతమైపోతూవుంది.

పండిన జొన్న కంకుల్ని మెక్కడానికని అడవి మృగాలు వస్తుంటాయి. వాటిని మట్టుపెట్టడానికి పశ్ళెటూళ్ళల్లో 'ఉండలు' పెడుతుంటారు. పెట్లుప్పు, గంధకం, నల్లమందు - తగిన పాళ్ళల్లో కలిపి వుండలు చేస్తారు. ఏ మాత్రం ఒత్తిడి తగిలినా ఆ వుండలు బాంబులా పేలుతాయి!

మామిడి ముట్టెల్లోని పప్పును తీసివేస్తారు. దానికి బదులు ఈ వుండల్ని పెడతారు. ఆ ముట్టెల్ని సన్నని నూలుదారంతో బిగిస్తారు. చూడ దానికవి మామిడిముట్టెల్లాగానే ఉంటాయి. వాటిపై మాంసం ముక్కతో మర్దన చేస్తారు. జొన్న చేలల్లో గెనిమలమీద పెడతారు. పందులు జొన్న కంకుల సంగతి మరచి ఈ ముట్టెల్ని వెదుక్కొంటూ వస్తాయి. మామిడి ముట్టె అని భ్రమించి నములుతాయి. ఆ వుండ పేలుతుంది. ఆ మృగం అక్కడికక్కడే చస్తుంది. తెల్లవారితే ఆ పందికూరను ఊరు పంచుకొంటుంది.

ఎంత ఆరాతీసినా ఆ వుండల్ని అక్కడ ఎవరు పెట్టారో? —అది గూడ ఒకటికి మూడు వుండలు ఒక్కచోటనే ఎందుకు పెట్టారో? ఒక దాన్ని తొక్కి కింద పడిన మనిషి సరిగ్గా మరో రెండు వుండలమీదనే ఎట్లా పడ్డాడో? ఎంత ఆలోచించినా ఎవరికీ అంతుచిక్కలేదు.

రెడ్డిగారి మిద్దెలో కాకి శోకంగావుంది.

'పాతప్పులోడి' పూరిగుడిసెలో ఓ నడివయసు ఆడది పిచ్చిగా తనలోతానే నవ్వుకొంటూ ఉంది.

"ఒరే! ఆ పాతప్పులోడి అప్పు తీరనట్లుందిరా! ఆ లోకంలో తీర్చుకుందా(వని బసిరెడ్డిని యీడ్సకపోయినట్లుందిరా!"—ఆ ఊళ్ళో అక్కడక్కడ గుంపులు చేరిన జనం గుసగుసలు పోతున్నారు.

సిద్దులుగాడు మాత్రం దోర్నం పట్టెమీద రాజాలా నిలబడుతున్నాడు. దర్జాగా బావిలో దూకుతున్నాడు. గట్టుపై కెక్కుతున్నాడు. మళ్ళీ దోర్నం పట్టెమీద నిలబడుతున్నాడు. మళ్ళీ దర్జాగా బావిలో దూకుతున్నాడు. వాడి ఒంటిమీది మంటలు ఎప్పుడూ చల్లారుతాయో? ఏమో? మరి!

—ఆంధ్రభూమి (2-4-81)